క్లుప్తంగా

రైతు కుటుంబానికి ఆర్థిక సాయం



కూచిపూడి(మొవ్వ):ఇటీవల మృతి చెందిన పాడి రైతు దేవినేని సామ్రాజ్యం కుటుంబానికి క్షీర బంధు పథకం ద్వారా రూ.50 వేల చెక్కుని కూచిపూడి పాల సేకరణ కేంద్రం అధ్యక్షురాలు పైడిపాముల మనోహరం చేతుల మీదగా గురువారం అందచేశారు. పామర్రు పాల శీతలీకరణ కేంద్రం మేనేజర్ చిట్టూరి దాయోదర కృష్ణ గోపి నాథ్ పర్యవేక్షణలో మృతురాలి భర్త దేవినేని శివనాగేశ్వరరావుకు చెక్కుని అందించారు. రూటు సూపర్‌వైజర్ కైలా రమేష్, పాడిరైతులు పామర్తి సోమేశ్వరావు, వేతన కార్యదర్శి మహంకాళి సత్య శ్రీనివాస్, టిస్టర్ లంకపల్లి సుబ్రమణ్యంలు పాల్గొన్నారు. ముందుగా రైతు సామ్రాజ్యం చిత్రపటానికి పూల మాలలేసి నివాళులర్పించారు.

నేడు ఉయ్యూరులో మెడికల్ క్యాంపు

పామర్రు:సమగ్ర శిక్ష ఆధ్వర్యలలో ఉయ్యూరు జెడ్పీ హైస్కూల్ ఆవరణలో శుక్రవారం మెడికల్ క్యాంపు నిర్వహిస్తున్నట్లు కృష్ణా జిల్లా ఏపీసీఎస్ఎస్ డాక్టర్ ఎ.శేఖర్ గురువారం తెలిపారు. వినికిడి, దృష్టి లోపం, బుద్ధి మాంద్యం ఉన్నటువంటి దివ్యాంగులకు ఉచితంగా వైద్య పరీక్షలు చేస్తామని చెప్పారు. 5 నుంచి 18 ఏళ్ల వయస్సు ఉన్న దివ్యాంగులకు సేవలు అందిస్తామని పేర్కొన్నారు. పెనమకూరు, కంకిపాడు, ఉయ్యూరు, తోట్లవల్లూరు, పమిడిముక్కల, పామర్రు, మొవ్వ, ఘంటసాల మండలాల్లోని వాళ్లు శిబిరానికి హాజరుకావాలని కోరారు. ఆధార్‌కార్డు, కుల ధ్రువీకరణ, రేషన్ కార్డు జిరాక్సులతోపాటుగా రెండుపాస్ పోర్టుసైజు ఫొటోలు తేవాలని సూచించారు.

సంక్షేమ ఫలాలు అందించాలి


నిడుమోలు(మొవ్వ):రాష్ట్ర ప్రభుత్వం అమలు చేస్తున్న సంక్షేమ ఫలాలు గిరిజనులందరికీ అందేలా అధికారులు ప్రత్యేక దృష్టి సాగించాలని జిల్లా గిరిజన సంక్షేమ సాధికారత అధికారి ఫణి ధూర్జటి ముదిగొండ పేర్కొన్నారు. మొవ్వ మండలం నిడుమోలులో బోయకాలనీ, చినముత్తేవిలోని గిరిజన, యానాది, చెంచు నివాస ప్రాంతాలను గురువారం ఆయన పరిశీలించారు. మురుగు నీటి పారుదల సౌకర్యం కల్పించాలని, ఆధార్, రేషన్ కార్డు సౌకర్యాలు కల్పించాలంటూ స్థానికులు విన్నవించారు. బోయకాలనీలోని మండల పరిషత్ పాఠశాలలో విద్యార్థుల ప్రగతిని పరిశీలించి, వెనకబడిన విద్యార్థుల పై ప్రత్యేక దృష్టి చూపించాలని ఉపాధ్యాయులకు సూచించారు.

హైదరాబాద్‌లో పామర్రు యువకుడు దుర్మరణం



పామర్రు: హైదరాబాద్‌లో గురువారం జరిగిన రోడ్డు ప్రమాదంలో పామర్రుకు చెందిన ప్రముఖ వ్యాపారవేత్త ఊటుకూరి మల్లికార్జున రావు కుమారుడు బాల సుబ్రహ్మణ్యం అలియాస్ బాలు (24) దుర్మరణం చెందాడు. బాలు హైదరాబాద్‌లో సాఫ్ట్‌వేర్ ఉద్యోగం చేస్తున్నాడు. గురువారం సాయంత్రం స్వగ్రామమైన పామర్రు బయలు దేరాల్సి ఉన్నది. ఉదయం తన స్నేహితుడితో కలిసి ఉద్యోగ విధులకు వెళ్లి ఖాళీ సమయంలో టిఫిన్ చేసేందుకు వెళ్తుండగా రోడ్డుపై వేగంగా వెళ్తున్న టిప్పర్ ఢీకొట్టింది. ఈ ఘటనలో బాలు అక్కడికక్కడే మృతి చెందగా మరొక వ్యక్తికి తీవ్రగాయాలయ్యాయి. మృతుడికి వివాహం కాలేదు. పామర్రు చాంబర్ ఆఫ్ కామర్స్ సభ్యులు, ఆర్యవైశ్య సంఘ నాయకులు, వాసవీ క్లబ్ సభ్యులు, అంకమ్మతల్లి దేవస్థానం సభ్యులు మృతుడి కుటుంబాన్ని పరామర్శించారు.

కొల్లేరు గ్రామాల్లో సందడి



కైకలూరు: టీడీపీ మోసపూరిత విధానాలు నచ్చక ముఖ్యమంత్రి వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి సమక్షంలో మాజీ ఎమ్మెల్యే జయమంగళ గురువారం పార్టీ కండవా కప్పుకుని వైఎస్సార్ సీపీలో చేరడంతో ప్రజలు హర్షం వ్యక్తం చేశారు. కొల్లేరు గ్రామాల్లో సందడి వాతావరణం నెలకొంది. జయమంగళ కై కలూరు సాయిబాబా మందిరంలో పూజలు చేశారు. మంత్రి కారుమూరి నాగేశ్వరరావు, కైకలూరు ఎమ్మెల్యే దూలం నాగేశ్వరరావు (డీఎన్నార్), ఆయన కుమారులు వినయ్, శ్యామ్‌లు జయమంగళతో పాటు సీఎంను కలిశారు. మార్గంలో ఏలూరులో ఎంపీ కోటగిరి శ్రీధర్‌ను ఆయన నివాసంలో ఎమ్మెల్యే డీఎన్నార్‌తో మర్యాదపూర్వకంగా కలిశారు.

50 మద్యం బాటిల్స్ స్వాధీనం

కైకలూరు: అక్రమంగా విక్రయించడానికి తరలిస్తున్న 50 మద్యం క్వాటర్ బ్యాటిల్స్‌ను రూరల్ ఏఎస్సై డి.వెంకటేశ్వరరావు గురువారం అదుపులోకి తీసుకున్నారు. గుమ్మళ్లపాడు గ్రామానికి చెందిన సైదు సుభద్రాచలం సంచిలో మద్యం సీసాలతో వస్తుండగా పట్టుకున్నామని పోలీసులు తెలిపారు.

శివరాత్రికి సర్వం సిద్ధం

- రేపు మహాశివరాత్రి
- ఐలూరులో పండుగ వాతావరణం
- భక్తుల కోసం ముమ్మర ఏర్పాట్లు

తోట్లవల్లూరు:దక్షిణకాశీగా పేరొందిన ఐలూరులోని గంగా పార్వతీ సమేత రామేశ్వరస్వామి ఆలయం శివరాత్రి వేడుకలకు ముస్తాబైంది. లక్ష మందికిపైగా తరలివచ్చే భక్తజనం కోసం అధికార యంత్రాంగం సర్వం సిద్ధం చేస్తోంది. ఆలయం వద్ద భక్తులకు నీడ కోసం షామియానాలు, తొక్కిసలాట లేకుండా క్యూలైన్లను ఏర్పాటు చేస్తున్నారు. భక్తుల కోసం తాగునీరు, పులిహోర, లడ్డూ ప్రసాదాలను సిద్ధం చేస్తున్నారు. శనివారం తెల్లవారుజాము నుంచి ఉయ్యూరు, మచిలీపట్నం డిపోల నుంచి ఆర్టీసీ ప్రత్యేక బస్సులను నడపనుంది. గ్రామంలో శానిటేషన్ పనులు ముమ్మరంగా సాగుతున్నాయి.

జల్లు స్నానాల కోసం ఏర్పాట్లు..

కృష్ణానదిలో నీరు లేనందును అధికారులు జల్లు స్నానాలను ఏర్పాటు చేస్తున్నారు. నాలుగు బోర్ల ద్వారా షవర్లను ఏర్పాటు చేసి జల్లు స్నానాలకు సిద్ధం చేశారు. తాగునీటి కోసం నదిలో చేతిపంపులు, ఆలయం, ఘాట్ వద్ద ఆరోగ్య శిబిరాలు, పోలీస్ కంట్రోల్‌రూం, అవుట్‌పోస్టులు ఏర్పాటు చేస్తున్నారు. అత్యవసర సేవల కోసం అంబులెన్సు, ఫైర్ సిబ్బందిని కూడా అందుబాటులో ఉంచుతున్నారు. శివరాత్రి ఏర్పాట్లను జెడ్పీటీసీ సభ్యుడు జొన్నల రామ్మోహన్‌రెడ్డి, తహసీల్దార్ కట్టా వెంకటశివయ్య, ఎంపీడీఓ తుంగల స్వర్ణలత, పమిడిముక్కల సీఐ కిషోర్‌బాబు, ఎస్ఐ రమేష్, ఆలయ చైర్మన్ సూర్యవరప్రసాద్, మేనేజర్ జయశ్రీ, పంచాయతీ కార్యదర్శి సుభాష్‌కుమార్, వివిధ శాఖల అధికారులు పర్యవేక్షిస్తున్నారు.

శివరాత్రికి ముస్తాబవుతున్న శివాలయాలు...

పామర్రు:మండల పరిధిలోని పలు శివాలయాల్లో శనివారం నిర్వహించే శివరాత్రి పర్వదినానికి ఆలయాలు సర్వాంగ సుందరంగా ముస్తాబవుతున్నాయి. సోమేశ్వరస్వామి ఆలయంలో శివపార్వతుల కల్యాణ మహోత్సవాన్ని సర్వాంగ సుందరంగా నిర్వహించేందుకు ఏర్పాట్లు చేస్తున్నారు. భక్తులకు ఏ విధమైన అసౌకర్యాలు కలుగకుండా చర్యలు తీసుకుంటున్నామని ఆలయ మేనేజరు కందుల వెంకటరెడ్డి గురువారం తెలిపారు. అడ్డాడ, కురుమద్దాలి, పసుమర్రు, నిమ్మకూరు, ఎలకుర్రు గ్రామాల్లోని శివాలయాలను శివరాత్రికి విశేషంగా అలంకరించి ప్రత్యేక పూజలు నిర్వహించేలా ఆయా ఆలయ కమిటీ సభ్యులు చర్యలు తీసుకుంటున్నారు. ప్రాకర్ల గ్రామంలో వేంచేసియున్న రామలింగేశ్వరస్వామి దేవస్థానంలో శివరాత్రికి ప్రత్యేక ఏర్పాటు నిర్వహిస్తున్నట్లు ఆలయ ధర్మకర్త కరిపినేని రామలింగేశ్వరరావు తెలిపారు. శివరాత్రి రోజు ఆలయం పక్కనే ఉన్న కొలనులో భక్తులు స్నానాలు చేసేందుకు ఏర్పాటు చేశామని చెప్పారు. ఆలయానికి విచ్చేసే భక్తులకు ఏవిధమైన అసౌకర్యం కలుగకుండా చూస్తామని పేర్కొన్నారు. సర్పంచ్ గొంతుపులి రామలింగేశ్వరరావు, వీఆర్వో రామారావు స్థానికులు పాల్గొన్నారు.



ఐలూరులో ముస్తాబైన రామేశ్వరస్వామి ఆలయం



పామర్రులో కల్యాణ మహోత్సవానికి సిద్ధమవుతున్న సోమేశ్వరస్వామి ఆలయం



కృష్ణానది వద్ద ఏర్పాట్లు పరిశీలిస్తున్న జెడ్పీటీసీ రామ్మోహన్‌రెడ్డి, తహసీల్దార్ వెంకటశివయ్య

తక్కెళ్లపాడు లేఅవుట్‌లో మెరక పనులు ప్రారంభం



మెరక పనులు ప్రారంభిస్తున్న ఎమ్మెల్యే డీఎన్నార్

మందవల్లి: మండలంలోని తక్కెళ్లపాడు గ్రామంలోని లేఅవుట్‌లో ఇళ్ల స్థలాల మెరక పనులను ఎమ్మెల్యే దూలం నాగేశ్వరరావు (డీఎన్నార్) గురువారం కొబ్బరికాయ కొట్టి పనులు ప్రారంభించారు. ఈ సందర్భంగా ఎమ్మెల్యే మాట్లాడుతూ పేదలకు ఇళ్లు ఏర్పాటు చేయడమే ముఖ్యమంత్రి జగనన్న ఆశయమన్నారు. స్థలాల మంజూరుతోపాటు నిర్మాణాలకు అన్ని రకాల ప్రభుత్వం సాయం అందిస్తుందని చెప్పారు. ఎంపీపీ పెద్దిరెడ్డి శ్రీరామదుర్గాప్రసాద్ (రాము), జెడ్పీటీసీ సభ్యురాలు ముంగర విజయనిర్మల, పార్టీ మండల అధ్యక్షుడు గుమ్మడి వెంకటేశ్వరరావు, సర్పంచ్ చేబ్రోలు సుధారాణి, మండల సర్పంచ్‌ల సంఘం అధ్యక్షుడు బేతపూడి యేసోబురాజు, ఇంగిలిపాకలంక సర్పంచ్ ఘంటసాల రత్నకుమారి, ఎంపీటీసీలు మోరు వెంకటరమణ, చాట్రగడ్డ నాగరాణి, జల్లి శౌరి, పీఏసీఎస్ అధ్యక్షుడు బొమ్మనబోయిన గోకర్ణ, గుడివాడ మురళీకృష్ణ తదితరులున్నారు.

పేదల అభ్యున్నతే లక్ష్యంగా పథకాలు

కైకలూరు ఎమ్మెల్యే డీఎన్నార్



సంక్షేమ పథకాల గురించి వివరిస్తున్న ఎమ్మెల్యే డీఎన్నార్

కైకలూరు(కలిదిండి): పేదల అభ్యున్నతే లక్ష్యంగా ముఖ్యమంత్రి వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి పథకాలను అమలు చేస్తున్నారని ఎమ్మెల్యే దూలం నాగేశ్వరరావు (డీఎన్నార్) అన్నారు. సర్పంచ్ అంద్రాజు రత్నమణి ఆధ్వర్యంలో 169వ రోజు కలిదిండి మండలం మట్టగుంట గ్రామంలో గడప గడపకు మన ప్రభుత్వం కార్యక్రమం గురువారం నిర్వహించారు. వివిధ పథకాల ద్వారా అందుకున్న లబ్ధికి సంబంధించిన బ్రోచర్లను ప్రజలకు పంపిణీ చేశారు. ఈ సందర్భంగా డీఎన్నార్ మాట్లాడుతూ ముఖ్యమంత్రి జగన్ తన సుదీర్ఘ పాదయాత్రలో ప్రజా సమస్యలను నేరుగా గమనించి సంక్షేమ పథకాలను అమలు చేస్తున్నారని చెప్పారు. కొల్లేరు ప్రాంత ప్రజలకు కావాల్సిన అన్ని సౌకర్యాలను వైఎస్సార్ సీపీ చేకూరుస్తుందని తెలిపారు. కొల్లేరు ప్రజల చిరకాల వాంఛగా మారిన రెగ్యులేటర్ల నిర్మాణం త్వరలో శంకుస్థాపన చేస్తారని పేర్కొన్నారు. నియోజకవర్గంలో పార్టీ అభివృద్ధికి అధికారులు, ప్రజాప్రతినిధులు సమన్వయంతో పనిచేయాలని సూచించారు. ఎంపీపీ చందన ఉమామహేశ్వరరావు, రాష్ట్ర క్షత్రియ కార్పొరేషన్ డైరెక్టరు నంబూరి శ్రీదేవి, ఏఎంసీ చైర్మన్ ఐనాల బ్రహ్మాజీరావు, వైస్ ఎంపీపీ నాగలక్ష్మి, వైఎస్సార్ సీపీ మండల అధ్యక్షుడు తిరుమాని రమేష్, ఏఎంసీ వైస్ చైర్మన్ పాము రవి కుమార్, నాయకులు కందుల వెంకటేశ్వరరావు, నీలపాల భోగేశ్వరరావు, బొమ్మిడి ధనరాజ్, పడవల శ్రీను, గద్దె ఆనంద్‌కుమార్, నున్న భగవానులు, మండా నవీన్, సచివాలయ సిబ్బంది, వలంటీర్లు పాల్గొన్నారు.



మట్టగుంటలో వైఎస్సార్ సీపీలో చేరిన నాయకులు

టీడీపీ నుంచి వైఎస్సార్ సీపీలో చేరికలు....

ముఖ్యమంత్రి వైఎస్ జగన్ మోహన్‌రెడ్డి ప్రజలకు అందిస్తున్న సంక్షేమ పథకాలపై ఆకర్షితులై గ్రామానికి చెందిన 20 మంది టీడీపీ నాయకులు, కార్యకర్తలు వైఎస్సార్ సీపీలో చేరారు. వీరిలో అంద్రాజు కృష్ణమూర్తి, నాగరాజు, జయ, బంగార్రాజు, పాపారావు, సురేష్ తదితరులు ఉన్నారు. వీరికి ఎమ్మెల్యే డీఎన్నార్ పార్టీ కండువా కప్పి ఆహ్వానించారు.

సమన్వయంతో అభివృద్ధి చేద్దాం



సమావేశంలో మాట్లాడుతున్న ఎంపీపీ రామిశెట్టి

ముదినేపల్లి రూరల్ : అధికారులు, ప్రజాప్రతినిధులు సమన్వయంతో మండలాన్ని అభివృద్ధి పథంలో పయనింపజేద్దామని ఎంపీపీ రామిశెట్టి సత్యనారాయణ తెలిపారు. ఎంపీడీఓ పి.మల్లీశ్వరి ఆధ్వర్యంలో గురువారం నిర్వహించిన ముదినేపల్లి మండల పరిషత్ సర్వసభ్య సమావేశంలో ఎంపీపీ మాట్లాడారు. మండలాన్ని అన్ని రంగాల్లో అభివృద్ధి చేయాల్సిన బాధ్యత ప్రజాప్రతినిధులు, అధికారులపై ఉందన్నారు. మండలంలో చేపట్టిన భవన నిర్మాణాల పనులను వేగవంతం చేయాలని, వేసవిలో తాగునీటి సమస్యలు తలెత్తకుండా ముందస్తు జాగ్రత్త చర్యలు తీసుకోవాలని సూచించారు. వ్యవసాయాధికారి బి.వేణుమాధవ్ మాట్లాడుతూ మండలంలో రబీ పంటగా 12 వేల ఎకరాల్లో మినుము సాగు చేయగా, 90 శాతం ఈక్రాప్ పూర్తయినట్టు చెప్పారు. ఆర్‌డబ్ల్యూఎస్ ఏఈ వీవీ కృష్ణారావు మాట్లాడుతూ జగనన్న లేఅవుట్లలో రూ.4 కోట్లతో మౌలిక సదుపాయాలు కల్పిస్తున్నట్టు తెలిపారు. ఎంఈఓ డి.రామారావు ప్రభుత్వ పాఠశాలల్లో చేపట్టిన నాడు - నేడు అభివృద్ధి పనులను వివరించారు.

ఈ సందర్భంగా జిల్లా స్థాయి ఉత్తమ పురస్కారాలను అందుకున్న ఎంపీడీఓ పి.మల్లీశ్వరి, విద్యుత్ ఏఈ పేర్ని రవికుమార్‌ను సత్కరించారు. హౌసింగ్ కార్పొరేషన్ డైరెక్టర్ గంటా సంధ్య, వైస్ ఎంపీపీ రాచూరి రాధా, కోఆప్షన్ సభ్యుడు షేక్ అల్లాభక్షు, సర్పంచ్‌లు, ఎంపీటీసీల సభ్యులు వివిధ శాఖల అధికారులు పాల్గొన్నారు.

సమస్యలు పరిష్కరించాలని ఆదేశం : ఎమ్మెల్యే కొడాలి నాని



ప్రజల నుంచి సమస్యలు తెలుసుకుంటున్న ఎమ్మెల్యే కొడాలి నాని

గుడివాడటౌన్: ప్రజల నుంచి వస్తున్న సమస్యలు తక్షణమే పరిష్కరించాలని ఎమ్మెల్యే కొడాలి శ్రీవెంకటేశ్వరరావు (నాని) అధికారులకు సూచించారు. నియోజకవర్గానికి చెందిన పలువురు తమ సమస్యలను పరిష్కరించాలని కోరుతూ ఎమ్మెల్యే నానికి వినతిపత్రాలు సమర్పించారు. అందరి సమస్యలు విన్న ఎమ్మెల్యే సంబంధిత అధికారులకు ఫోన్‌లు చేసి యుద్ధ ప్రాతిపదికన సమస్యలు పరిష్కరించాలని ఆదేశించారు. సాంకేతిక కారణాలు ఏమైనా ఉంటే వాటిని తెలియజేసి పరిష్కారానికి కృషి చేయాలని కోరారు.

కాంగ్రెస్ నాయకుడు మాణిక్యాలరావు మృతి



గుడివాడటౌన్ : సీనియర్ కాంగ్రెస్ నాయకుడు మట్టా మాణిక్యాలరావు(78) గురువారం మృతి చెందారు. సాధారణ కాంగ్రెస్ కార్యకర్త నుంచి ఉమ్మడి కృష్ణా జిల్లా కాంగ్రెస్ పార్టీ ప్రధాన కార్యదర్శిగా పార్టీకి సేవలందించారు. లింగవరం గ్రామ ఉప సర్పంచ్‌గా పనిచేసిన ఆయన కాంగ్రెస్‌లోని రాష్ట్ర స్థాయి అగ్ర నాయకత్వంతో సన్నిహితంగా మెలిగేవారు. ఆయనకు ముగ్గురు కుమారులు, కుమార్తె ఉన్నారు.

భూ హక్కు పత్రాలు పంపిణీ



భూ హక్కు పత్రాలు అందజేస్తున్న ఎంపీపీ దాసరి అశోక్‌కుమార్

నిమ్మకూరు(పామర్రు):భూ సంబంధిత సమస్యలకు చెక్ పెట్టేందుకు భూరికార్డుల స్వచ్ఛీకరించేందుకు రాష్ట్ర ప్రభుత్వం వైఎస్సార్ జగనన్న శాశ్వత భూ హక్కు-భూరక్ష పథకం అమలు చేసి లబ్ధిదారులకు భూ హక్కు పత్రాలను అందిస్తుందని ఎంపీపీ దాసరి అశోక్‌కుమార్ తెలిపారు. నిమ్మకూరు సచివాలయంలో నిమ్మకూరు, నిభానుపూడి గ్రామాల్లో అర్హులైన లబ్దిదారులకు భూ హక్కు పత్రాలను గురువారం అందజేశారు. ఎంపీపీ మాట్లాడుతూ 120 ఏళ్ల నాటి సర్వే రికార్డుల ఆధారంగానే పనులు జరగడంతో ఎన్నో అవకతవకలు చోటు చేసుకుటున్నాయని దీనిని గుర్తించిన ప్రభుత్వం గ్రామాల్లో సమగ్ర భూ సర్వే నిర్వహించిందని చెప్పారు. సుపరి పాలనలో భాగంగా రాష్ట్ర ప్రభుత్వం చేపట్టిన అత్యంత ప్రాధాన్య కార్యక్రమాల్లో భూ సమగ్ర రీ సర్వే ప్రధాన మైనదని పేర్కొన్నారు. ఆత్యాధునిక టెక్నాలజీ సహాయంతో భూముల సమగ్ర సర్వేలను చేపట్టారన్నారు. 100 శాతం కచ్చితత్వంతో భూముల సర్వే చేసి సంబంధిత రైతులకు భూ హక్కు పత్రాలను అందజేస్తున్నామని పేర్కొన్నారు. వీఆర్వో బేబి సరోజిని, సచివాలయ సిబ్బంది రైతులు పాల్గొన్నారు.

టిడ్కో హౌసింగ్ ఫైనాన్స్ వేగవంతం చేయండి



మాట్లాడుతున్న కమిషనర్ మురళీకృష్ణ

గుడివాడటౌన్: టిడ్కో ఇళ్ల లబ్ధిదారులకు బ్యాంకు రుణాలు మంజూరయ్యేలా కావాల్సిన పూర్తి సమాచారాన్ని అందించాలని మున్సిపల్ కమిషనర్ వి.మురళీకృష్ణ ఆదేశించారు. మున్సిపల్ కార్యాలయంలో గురువారం సాయంత్రం సచివాలయ ఉద్యోగులు, మెప్మా సిబ్బందితో ఆయన సమీక్షా సమావేశం నిర్వహించారు. పట్టణ పరిధిలో దరఖాస్తు చేసుకున్న లబ్ధిదారులందరికీ టిడ్కో ఇళ్లు మంజూరు చేశామని తెలిపారు. కొంతమంది లబ్ధిదారులు వారికున్న అర్హతలను ఇవ్వడంలో జాప్యం చేస్తున్న నేపథ్యంలో బ్యాంకర్లు రుణాలు ఇచ్చేందుకు సుముఖత వ్యక్తం చేయడంలేదన్నారు. ప్రతి సచివాలయం ఆర్‌పీల పరిధిలో బ్యాంకులోనుకు దరఖాస్తు చేసుకుని సంబంధిత పత్రాలు అందజేయని వారి పేర్లు వెంటనే గుర్తించి కౌన్సెలింగ్ ఇవ్వాలని సూచించారు. లేనిపక్షంలో గృహాలు రద్దు చేస్తామని చెప్పాలన్నారు. అసిస్టెంట్ కమిషనర్ టీవీ రంగారావు, సిటీ ప్లానర్ వై.రాంబాబు తదితరులు పాల్గొన్నారు.

పెద్దింట్లమ్మ జాతరలో వసతులు కల్పించాలి

- ఆర్డీఓ పెంచల కిషోర్
- ఈ నెల 21 నుంచి మార్చి 7 వరకు జాతర



కైకలూరులో అమ్మవారి వార్షిక ఆహ్వాన పుస్తకాన్ని విడుదల చేస్తున్న ఎమ్మెల్యే డీఎన్నార్

కైకలూరు: రాష్ట్రంలో ప్రసిద్ధిగాంచిన కొల్లేటికోట పెద్దింట్లమ్మ వార్షిక జాతర విజయవంతానికి జాగ్రత్తలు పాటించాలని ఉత్సవ సమన్వయ కమిటీ చైర్మన్, ఏలూరు డివిజన్ ఆర్డీఓ కె.పెంచల కిషోర్ సూచించారు. జాతర నిర్వహణ నిమిత్తం రెండో విడత సమావేశం ఆలయం వద్ద గురువారం నిర్వహించారు. ఆలయ ఈఓ కేవీ గోపాలరావు సమన్వయకర్తగా వ్యవహరించారు. ఈ సందర్భంగా ఆర్డీఓ మాట్లాడుతూ ఉష్ణోగ్రతలు పెరుగుతున్న దృష్ట్యా పంచాయతీరాజ్, ఆర్‌డబ్ల్యూఎస్, దేవదాయశాఖలు కమిటీగా ఏర్పడి నిరంతరం తాగునీరు భక్తులకు అందించాలని, నిత్యం 30 మంది పారిశుధ్య కార్మికులతో షిఫ్టుల ప్రకారం పనిచేయించాలని, మొత్తం 20 తాత్కాలిక మరుగుదొడ్లను భక్తుల కోసం ఏర్పాటుచేయాలని ఆదేశించారు. సర్కారు కాలువ వంతెన నుంచి ఆలయం వరకు భక్తుల కోసం నీటి సరఫరా కేంద్రాలను ఏర్పాటు చేయాలని, సర్కారు కాలువ ఇనుప వంతెన వద్ద ట్రాఫిక్‌కు అంతరాయం కలగకుండా బందోబస్తు నిర్వహించాలని చెప్పారు. సర్కిల్ రూరల్ సీఐ వైవీవీఎల్ నాయుడుతో 'క్యూ' లైన్లు, వాహనాల పార్కింగ్‌పై చర్చించారు.

ఆలయ ఈఓ గోపాలరావు మాట్లాడుతూ ఈ నెల 21 నుంచి మార్చి 7వ తేదీ వరకు నిర్వహించే పెద్దింట్లమ్మ జాతరలో ప్రధాన ఘట్టమైన జలదుర్గా, గోకర్ణేశ్వరస్వామి వార్ల కల్యాణం మార్చి 3న నిర్వహిస్తామని చెప్పారు. తహసీల్దారు బి.మురళీకృష్ణ, ఏలూరు డివిజన్ డీఎల్‌పీఓ పి.అన్నామణి, ఎంపీడీఓ రామలింగేశ్వరరావు, గ్రామపెద్ద బలే సముద్రుడు, ఫైర్, అటవీ, ఆర్అండ్‌బీ, విద్యుత్, వైద్యం తదితర శాఖల అధికారులు హాజరయ్యారు.

జాతర పుస్తకావిష్కరణ...

పెద్దింట్లమ్మ జాతర ఉత్సవాల వార్షిక కరపుస్తకాన్ని కైకలూరులోని తన నివాసం వద్ద ఎమ్మెల్యే దూలం నాగేశ్వరరావు (డీఎన్నార్) అవిష్కరించారు. ఆయన్ని వేదపండితులు మంత్రోచ్ఛరణ చేసి ఆశీర్వదించారు. జాతరను దిగ్విజయంగా నిర్వహించాలని ఎమ్మెల్యే సూచించారు. ఈఓ గోపాలరావు, ధర్మకర్తలు, కొల్లేరు పెద్దలు పాల్గొన్నారు.

పీఏసీఎస్ అధ్యక్షుడిగా రంగారెడ్డి



ప్రమాణస్వీకారం చేస్తున్న రంగారెడ్డి

గుడివాడటౌన్(నందివాడ):నందివాడ పీఏసీఎస్ అధ్యక్షుడిగా కొండపల్లి రంగారెడ్డి గురువారం బాధ్యతలు స్వీకరించారు. కో-ఆపరేటివ్ డివిజన్ రిజిస్ట్రార్ విజయలక్ష్మి గతంలో నియామకపత్రాన్ని అందించగా రంగారెడ్డి బాధ్యతలు స్వీకరించారు. ఈ కార్యక్రమానికి ముఖ్య అతిథిగా విచ్చేసిన దుక్కిపాటి శశిభూషణ్ మాట్లాడుతూ సహకార సంఘాల అభివృద్ధికి రంగారెడ్డి పూర్తి న్యాయం చేస్తారనే నమ్మకం ఉందన్నారు. పదవులు అలంకార ప్రాయం కాకూడదని బాధ్యతా యుక్తంగా వ్యవహరిస్తూ ప్రజల మన్ననలు పొందాలని కోరారు. బ్యాంకులు బలోపేతం చేయడంతో పాటు రైతులకు పెద్దమొత్తంలో రుణాలు ఇచ్చి వారి అభివృద్ధికి తోడ్పడాలన్నారు. ఎంపీపీ పెయ్యల ఆదాం, గ్రామ సర్పంచ్ సరెళ్ల రత్నకుమారి, వైఎస్సార్ సీపీ సీనియర్ నాయకులు మలిరెడ్డి కృష్ణారెడ్డి, దేశిరెడ్డి రామ్మోహనరెడ్డి, కొండపల్లి కుమార్‌రెడ్డి, గూడపాటి వెంకటేశ్వరరావు, కందుల నాగరాజు, బ్యాంకు అధికారులు తదితరులు పాల్గొన్నారు.

ఘనంగా వీరాంజనేయస్వామి ఆలయ వార్షికోత్సవం



రావర్ల(పామర్రు):గ్రామంలోని వీరాంజనేయ స్వామి ఆలయ 7వ వార్షికోత్సవాన్ని గురువారం ఘనంగా నిర్వహించారు. స్వామికి పంచామృతాలు, నవరసాలతో పసుపు, కుంకుమ, చందనాలతో విశేషంగా అభిషేకాలు చేశారు. శతసహస్తనామాలతో ప్రత్యేకంగా పూజలు జరిపించారు. నాగవల్లీలతో మాలలను వేసి, విశేషంగా పుష్పమాలలతో స్వామిని సర్వాగ సుందరంగా అలంకరించారు. అనంతరం వచ్చిన భక్తులకు నీరాజనమంత్ర పుష్పాలు, తీర్థ ప్రసాదాలను వితరణ చేశారు. ఆలయ ప్రాంగణంలో వచ్చిన భక్తులు అందరికీ అన్న సమారాధన నిర్వహించారు.

కాకర్ల సుభాష్ చంద్రబోస్, జనార్ధనరావు, రామ్మోహన్‌రావు, కాకర్ల వెంకటేశ్వరరావు, అనిత, నాగేశ్వరరావు, కృష్ణకుమారి, సంధ్యాలక్ష్మీ, రాఘవమ్మ తదితరులు పాల్గొన్నారు.

మెగా ఉపకరణాల నిర్ధారణ శిబిరం



పరీక్షలు నిర్వహిస్తున్న వైద్యులు

గుడివాడటౌన్: దివ్యాంగుల అవసరాలకు అనుగుణంగా ఉపకరణాలు ఏర్పాటు చేయడం వల్ల వారి జీవన విధానంలో మార్పులు వస్తాయని సర్వశిక్ష కృష్ణా జిల్లా అడిషనల్ ప్రాజెక్ట్ ఆఫీసర్ డాక్టర్ ఎ.శేఖర్ తెలిపారు. ఎస్‌పీఎస్ హైస్కూల్లో సమగ్రశిక్ష ఆధ్వర్యంలో గురువారం మెగా ఉపకరణాల నిర్ధారణ పరీక్షలు నిర్వహించారు. గుడివాడ, గడ్లవల్లేరు, నందివాడ, పెదపారుపూడి, బాపులపాడు, గన్నవరం మండలాలకు చెందిన 143 మంది దివ్యాంగులు ఈ శిబిరంలో పేర్లు నమోదు చేసుకుని వారి అవసరాలను వివరించినట్లు తెలిపారు. వీరి అవసరాలను బట్టి ట్రై సైకిళ్లు, వినికిడి యంత్రాలు, చంకకర్రలు, ఇతర పరికరాలను ప్రభుత్వం ఉచితంగా అందజేస్తుందన్నారు. తాము సేకరించిన వివరాలను సంస్థకు అందజేసిన అనంతరం ఉపకరణాలను సిద్ధం చేశాక తిరిగి వీరికి అందిస్తామని పేర్కొన్నారు. సమగ్రశిక్ష సాహితీవిద్య సమన్వయకర్త ఎస్.రాంబాబు, అసిస్టెంట్ కో-ఆర్డినేటర్ కె.ఏడుకొండలు, ఎంఈఓ జి.శేఖర్‌సింగ్, పాఠశాల ప్రధానోపాధ్యాయురాలు టీఎంఈ రాణి, వైద్యులు పి.కామరాజు, వి.రాజ్యలక్ష్మి, ఎల్. లారా, కె.కుమార్, బి.గోపీచంద్, భవిత కేంద్రం నిర్వాహకుడు నీలాంబ్రమ్, తదితరులు పాల్గొన్నారు.

వేంకటేశ్వరస్వామికి వెండి పంచె బహూకరణ



గుడివాడటౌన్:జగన్నాథపురం పాటిమీద వేంచేసియున్న వేంకటేశ్వరస్వామి వారి దేవస్థానంలో స్వామి వారికి భక్తులు గురువారం వెండి పంచె బహూకరించారు. భక్తులు నాగవెంకట రామోజీరావు-మహిత దంపతులు, అన్నం వెంకటలక్ష్మి, పాండు నరసింహారావు స్వామి వారికి సుమారు 2 కిలోల 17 గ్రాముల వెండి పంచె (శ్రీ స్వామివారి పంచె) అందించారు. ఈ సందర్భంగా ఆలయ ఈఓ నటరాజన్ షణ్ముగం మాట్లాడుతూ స్వామి వారి అనుగ్రహం మేరకు భక్తులు పెద్దమొత్తంలో కానుకలు సమర్పిస్తున్నారన్నారు. కలియుగ ప్రత్యక్ష దైవం వేంకటేశ్వర స్వామి వారికి నిత్యాలంకరణ నిమిత్తం ఈ వెండి పంచె అందించడం అభినందనీయం అన్నారు. ట్రాఫిక్ సబ్ ఇన్‌స్పెక్టర్ వన ప్రసాదరావు, ఆలయ అర్చకుడు వేదాంతం అప్పలాచార్యులు ఉన్నారు.

